
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

**Editor :** **J. C. CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి **9** సెప్టెంబరు **1988** సంచిక **2**

# సంపాదకీయము

## పరలోకానికి వెళ్ళగోరు వారెవరు ?

## ( *Who wants to go to Heaven ?* )

అనేకులు పరలోకం ఉన్నదని నమ్ముదురు, దాన్ని గూర్చి చెబుతుంటారు. వివిధ మతాలు భావి జీవితాన్ని గూర్చి బోధిస్తాయి. ఎవరైనా మరణిస్తే, వారు స్వర్గస్థులైనారని మనం చెప్పుట కద్దు.

పరలోకాన్ని గూర్చి బైబిలు ఎంతో బోధించుచున్నది. లోకం సృష్టింపబడక ముందునుండి అది దేవుని గృహం. మానవుడు రక్షింపబడి నిత్యజీవ నిరీక్షణను కలిగి యుండునట్లు దేవుడు యేసు ప్రభువును ఈ లోకానికి పంపాడు. ఆయన మానవుల మధ్య నివసించి, సిలువ మరణము నొందాడు. ఆయన మృత్యుంజయుడై లేచి పరమందున్న తన తండ్రి యొద్దకు ఆరోహణ మయ్యాడు. నేటికిని ఆయన అక్కడే యున్నాడు.

ఒకానొక దినమందు క్రీస్తు మరల వచ్చుచున్నాడు. క్రీస్తు ఈ

లోకంలో యున్నప్పుడు ఇట్లన్నాడు : "మీ హృదయమును కలవర పడనియ్యకుడి; దేవునియందు విశ్వాస ముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు. లేని యెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:1-3).

పరలోకానికి ఎవరు వెళ్లగలరు? క్రీస్తులోను, ఆయన సంఘము లోను ఉండి నమ్మకముగాయున్న నీతిమంతులు మాత్రమే. అవిశ్వాసి, భక్తిహీనుడు, అపనమ్మకమైన క్రైస్తవుడు, దురాత్మగ్రస్తుడు అక్కడికి వెళ్లజాలడు. ఒకడు గొర్రెలనుండి మేకలను వేరుచేయునట్లు తీర్పుదినమందు ప్రభువు నీతిమంతులను, అనీతి మంతులను వేరు చేయును (మత్త 25:31-46).

లేఖనాల్లో పరలోకాన్ని గూర్చి అనేకసార్లు చెప్పబడింది. ప్రకటన గ్రంథంలో భక్తుడైన యోహాను తాను పొందిన పరలోక దర్శనాన్ని ఈ రీతిగా మనకు వర్ణించాడు : "అంతట నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని చూచితిని. మొదటి ఆకాశమును మొదటి భూమియు గతించిపోయెను. సముద్రమును ఇక లేదు. మరియు నేను నూతనమైన యెరూషలేము అను పట్టణము తన భర్త కొరకు అలంకరింపబడిన పెండ్లి కుమార్తెవలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగి వచ్చుట చూచితిని. అప్పుడు - ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది; ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలై యుందురు, దేవుడు తానే వారి దేవుడై యుండి వారికి తోడై యుండును. ఆయన వారి కన్నుల ప్రతి భాష్ప బిందువును తుడిచివేయును. మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను,

వేదన యైనను ఇక ఉండదు. మొదటి సంగతులు గతించిపోయెనని సింహాసనములోనుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని. అప్పుడు సింహాసనాసీనుడై యున్నవాడు - ఇదిగో సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నానని చెప్పెను, మరియు ఈ మాటలు నమ్మకమును నిజమునై యున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో ఇట్లనెను - సమాప్తమైనవి. నేనే అల్ఫాయు ఓమెగయు అనగా ఆదియు అంతమునై యున్నవాడను; దప్పిగొనువానికి జీవజలముల బుగ్గలోని జలమును నేను ఉచితముగా అనుగ్రహింతును. జయించు వాడు వీటిని స్వతంత్రించుకొనును; నేనతనికి దేవుడనై యుందును, అతడు నాకు కుమారుడై యుండును. పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికు లందరును అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందుదురు, ఇది రెండవ మరణము" (ప్రక 21:1-8).

దుష్టత్వముతోను, పాపముతోను నిండియున్న ఈ లోకంలో యున్న ప్రతివాడు పరలోకానికి వెళ్ళగోరాలి. ఈ లోక సంగతులేమీ అక్కడ యుండవు. మరియు శాంతి సమాధానములు అక్కడ యుండును. అపొ. పౌలు పరలోకానికి వెళ్ళగోరాడు. అయినను అతడీ లోకములో యుండుట కొంతమట్టుకు అవసరమని ఎంచాడు. "నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము. అయినను శరీరముతో నేను జీవించుటయే నాకున్న పనికి ఫలసాధనమైన యెడల నేనేమి కోరుకొందునో నాకు తోచలేదు. ఈ రెంటి మధ్యను ఇరుకున బడియున్నాను. నేను వెడలిపోయి క్రీస్తుతో కూడ నుండవలెనని నాకు ఆశ యున్నది, అది నాకు మరి మేలు. అయినను నేను శరీరమునందు నిలిచియుండుట మిమ్మును బట్టి మరి అవసరమై యున్నది" (ఫిలిప్పీ 1:21-24).

పరలోకానికి వెళ్ళాలనే ఆశ కలిగి యున్నామని చెప్పేవారు

చాలమంది యున్నారు గాని పరలోకానికి వెళ్ళేలాగున వారు జీవించరు. ఈ లోక సంగతులనే వారు ఎక్కువ ఆలోచిస్తూ యుంటారు, వాటి కొరకై జీవిస్తారు. యేసు ఇట్లు చెప్పాడు: "భూమిమీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును, దొంగలు కన్నము వేసి దొంగిలెదరు. పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనమెక్కడ నుండునో అక్కడనే నీ హృదయము ఉండును" (మత్తయి 6:19-21).

ఈ లోకంలో ఏదేది ప్రాముఖ్యమో అపొ. పౌలు మనకు గుర్తు చేయుచున్నాడు: "మన మీ లోకములోనికి ఏమియు తేలేదు, దీనిలో నుండి ఏమియు తీసికొనిపోలేము. కాగా అన్నవస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తిపొంది యుందము. ధనవంతులగుటకు అపేక్షించు వారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి. దైవజనుడా, నీవైతే వీటిని విసర్జించి నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాదించుకొనుటకు ప్రయాసపడుము" (1 తిమో 6:7-11).

మిత్రుడా, నీవు నీ కుటుంబము పరలోకానికి వెళ్ళగోరుచున్నారా! అట్లయితే దేవుని వాక్యాన్ని చదవండి, ప్రభువు ఆజ్ఞలకు విధేయులు కండి. "దేవుడు తన్ను ప్రేమించువారికి ఏవి సిద్ధపరచెనో అవి కంటి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్యహృదయమునకు గోచరమ

కాలేదు" (1 కొరింథీ 2:9). నీవు పరలోకాన్ని సాధించితే సమస్తము పొందినట్లే. దాన్ని పోగొట్టుకొంటే అంతా పోగొట్టుకొన్నట్లే. ప్రభువు నీ కొరకు ఒక స్థలాన్ని సిద్ధపరచాడు. ఆ నివాసంలో యుండుటకు ఇప్పుడే నీవు సిద్ధపడియుండాలి. సిద్ధపడిన వారికొరకు సిద్ధపరచబడిన స్థలమే పరలోకము.

---

## "నేనే సత్యము"

యేసు "నీవన్నట్టు నేను రాజునే; సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని. ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని. సత్య సంబంధియైన ప్రతివాడును నా మాట వినుననెను, అందుకు పిలాతు సత్యమనగా ఏమిటి? అని ఆయనతో చెప్పెను (యోహాను 18.38). "నీవు దేవుడవు గనుక నీ మాట సత్యము" (2 సమూయేలు 7:28). "సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము. నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17). "ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను" (యోహాను 1 : 1). "ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను" (యోహాను 1:14). గాన 'నేనే సత్యము' అని చెప్పెను.

కాబట్టి యేసు, తనను నమ్మిన యూదులతో-మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయునని చెప్పగా, వారు మేము దాసులము కాదనిరి. అందుకు యేసు— పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను (యోహాను 8 : 31-35). పాపదాసత్వములో నున్న వారిని విడిపించి దేవుని కుమారులుగా చేయుటకు క్రీస్తు వచ్చెను. కుమారుడు మిమ్ములను స్వతంత్రులనుగా చేసిన

యెడల మీరు నిజముగా స్వతంత్రులై యుందురు" (యోహాను8:36). "బలవంతుడు ఆయుధములు ధరించుకొని, తన ఆవరణమును కాచుకొనునప్పుడు, అతని సొత్తు భద్రముగా ఉండును" (లూకా 11:21). "అయితే అతనికంటె బలవంతుడైన ఒకడు అతని పైబడి జయించునప్పుడు, అతడు నమ్ముకొనిన ఆయుధముల నన్నిటిని లాగుకొని అతని ఆస్తిని పంచిపెట్టును" (లూకా 11:22). ఇందలి మొదటి బలవంతుడు-సాతానుడు. తన ఆవరణ - ఈ లోకము, అతను కాచుకొనుచున్నాడు అతని సొత్తు - లోకములో ఉన్న పాపులందరు. అతని ఆయుధములు - శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము. సాతానుడు ఆదాము పడిపోయిన నాటినుండి తానే ఈ లోకాధికారి. అందరిని పాపములో బంధించి కాచుకొనుచున్నాడు.

అంతకంటే బలవంతుడైన క్రీస్తు వాని జయించి వాని సొత్తు కొల్లగొట్టి వాని ఆయుధములు లాగుకొనెను. (1 యోహాను 4:4; 1 యోహాను 2:1; 1 యోహాను 3:4; కొలస్స 1:13; 2:15) చదువుము. క్రీస్తు సాతాను చెరనుండి మనలను విడిపించెను. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్య నివాసులనుగా చేసెను" (కొలస్స 1:13).

కాబట్టి మన మిప్పుడు యేసుక్రీస్తు నందున్నవారమై సత్యవంతుని యందున్నాము. ఆయన రాజ్యములో యున్నాము. సత్యము మనలను స్వతంత్రులనుగా చేసెను. ఆయనే సత్యము.

—P. ప్రకాశం, హైదరాబాద్.

# నిత్య నిర్ణయము

## *(Perpetual Decree)*

"సముద్రము దాటలేక యుండునట్లును, దాని తరంగము లెంత పొర్లినను అవి ప్రబలలేకయు, ఎంత ఘోషించినను దాన్ని దాటలేకయు ఉండునట్లు నిత్య నిర్ణయముచేత దానికి ఇసుకను సరిహద్దుగా నియమించిన నాకు మీరు భయపడరా? నా సన్నిధిని వణకరా? ఇదే యెహోవా వాక్కు" (యిర్మీయా 5:22). సూర్యుని చుట్టు భూమి నిర్ణీత వేగముతో నిర్ణీత కక్ష్యలో ఎట్టి ప్రమాదము వాటిల్లకుండ పరిభ్రమించునట్లు నిర్ణయించి, భూమిని నరులకు నివాసయోగ్యముగ చేసి, మానవులకు కావలసిన సరియైన ఉష్ణోగ్రతలో జీవించునట్లు సూర్యునికి భూమికి మధ్య దూరాన్ని నిర్ణయించిన ఈ మహా నిర్ణేత చిత్తాన్ని మానవుడు తెలిసికోవాలి, గ్రహించాలి.

"సముద్రమునకును భూమికిని సృష్టికర్తయై ఆకాశమందుండు దేవుడై యున్న యెహోవా" (యోనా 1:9) అని యోనా చెప్పెను. "ఆకాశమును, భూమిని, సముద్రమును వాటిలో ఉండు సమస్తమును సృజించిన జీవముగల దేవునివైపు తిరుగవలెనని మీకు సువార్త ప్రకటించుచున్నాము" (అపొ. కా. 14:15). "సముద్ర మార్గములలో సంచరించు వాటి నన్నిటిని వాని పాదములక్రింద నీవు ఉంచియున్నావు. యెహోవా మా ప్రభువా భూమి యందంతట నీ నామము ఎంత ప్రభావముకలది!" (కీర్త 8:8-9).

సముద్రమును అందలి సమస్తమును సృజించి భూమిని మానవులకు నివాసయోగ్యముగా చేసిన (యోబు 37:12) దేవుని నిత్య నిర్ణయములను కొన్ని మనము పరిశీలించుదము. దేవుడు నరుని నిర్మించి అతనికి కావలసిన సమస్తమును అతనికి అనుగ్రహించెను. వారు తన

కుమారుని ద్వారా విమోచింపబడునట్లు నిత్య నిర్ణయము చేసి యున్నాడు.

క్రీస్తు యిట్లు పలికాడు: "నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు" (యోహా 14:6). ఇది తండ్రి నిత్య నిర్ణయము. "యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని మనము తన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసీ 1:4-6). రక్షణ క్రీస్తులో ఉన్నది. రక్షింపబడినవారే సంఘము. "దేవుని సంఘమునకు అనగా క్రీస్తునందు పరిశుద్ధ పరచబడినవారై పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారికి......" (1 కొరింథీ 1:2). సంఘము అనగా పరిశుద్ధులుగా నుండుటకు పిలువబడినవారు. సంఘమునకు ప్రాముఖ్యత లేదనువారు దేవుని నిత్య నిర్ణయాన్ని అంగీకరించని వారే.

"మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను" (హెబ్రీ 9:27). దేవుడు చేసిన ఈ నిర్ణయాన్ని ఎదిరించగలవాడేడి? "నీ జీవమేపాటిది" (యాకో 1:14). ఇది మన బ్రతుకును గూర్చిన నిత్య సత్యం. మనం పరదేశులమైతే యాత్రికులమైతే నిత్య నివాసం మనకు కావాలి. ఈ నిత్యనివాసాన్ని మనకివ్వడానికి దేవుని నిత్య నిర్ణయ మున్నది.

రక్షణ, నిత్య జీవం ఈ రెండు దేవుడు చేసిన వాగ్దానాలు. ఆయన నమ్మదగినవాడు కనుక ఆయన వాగ్దానములు నమ్మదగినవి. వీటిని మనం విధేయతద్వారా తప్ప పొందడానికి మరే యితర మార్గం లేదు.

రక్షణ కావాలి బాప్తిస్మం అవసరంలేదు. పరలోకం కావాలి. సంఘము అవసరం లేదు. ఈ విచిత్రమైన పరిస్థితి ఈనాడు కలిగి

యుండటం మిక్కిలి దురదృష్టకరం. తనకు విధేయులైనవారి కొరకే వాగ్దానాలు చేయబడ్డాయి.

నిత్యాగ్ని, నిత్యజీవం ఈ రెంటిలో ఒక దానిని మనం బ్రతికి యుండగానే నిర్ణయించుకొనవలసిన అవసరమున్నది.

సృష్టిని అదుపులో నుంచి నరులకు నివాసయోగ్యంగా భూమిని రూపించి నిన్ను ప్రేమతో పిలుస్తున్న దేవుని పిలుపు నీవు అంగీకరించవా? ఆయనకు భయపడవా? ఆయన సన్నిధిని వణకవా?

అట్లయితే నీవు ఊహించని భయంకర ఉగ్రతను గూర్చి ఈనాడు ఆలోచించుము.

రక్షణమార్గము :

1. ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము (అపొ.కా. 16:31).
2. మారుమనస్సు పొందుము (లూకా 13:3).
3. క్రీస్తు ప్రభువని నోటితో ఒప్పుకొనుము (రోమా 10:9).
4. బాప్తిస్మము పొందుము (అపొ. కా. 2:38).
5. మరణమువరకు నమ్మకమైన క్రైస్తవునిగ జీవించుము (ప్రక 2 : 10).

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

## సంఘమును గూర్చిన ఏడు సంగతులు

సంఘము క్రీస్తుయొక్క రక్తముచే కొనబడినది (అపొ. కా. 20:28). బాప్తిస్మము పొందినవారు సంఘములో చేర్చబడుదురు. వారు సంఘములో ఉండి ఆయనను ఆరాధింపబద్ధులై యున్నారు. క్రీస్తు తన సంఘమును కట్టుదునని చెప్పెను (మత్తయి 16:18). పెంతె

కొస్తు పండుగ దినమున సంఘము 3000 మందితో స్థాపింపబడెను. అప్పటి నుండి అనేకులు సంఘములోనికి చేర్చబడుచుండిరి. క్రీస్తు సంఘము ప్రపంచ మంతట వ్యాపించెను. క్రీస్తు సంఘమును ప్రేమించి అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి యేదైనను లేక పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను, మహిమ గల సంఘముగాను ఆయన, తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని వాక్యముతో ఉదక స్నానముచేత దానిని పవిత్రపరచి పరిశుద్ధపరచుటకై దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసీ 5 27). అట్టి మహిమగల సంఘము ఏమైయున్నదో తెలిసికొందము.

(1) సంఘము దేవుడు నివసించు ఆలయమై యున్నది: "ఆయనలో మీరు కూడా ఆత్మమూలముగా దేవునికి నివాస స్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫె 2.22). సంఘము దేవుని స్తుతించుటకు కూడి యున్నప్పుడు దేవుడు అచ్చట ఉండి ఆ స్తుతులను స్వీకరించును (మత్తయి 18:20).

(2) క్రీస్తుయొక్క భార్యతో సంబంధమును తెలుపునట్టిదై యున్నది. "క్రీస్తు సంఘమునకు శిరస్సు" (కొలస్స 1:18). "మీరు క్రీస్తు శరీరమై యున్నారు" (1 కొరింధి 12:27).

(3) తర్ఫీదునిచ్చే స్కూలు: సంఘము రెండు విధములుగా తర్ఫీదు నిచ్చును. అవేమనగా, 1) క్రైస్తవుడగుట ఎట్లు. "సంఘము ద్వారా దేవుని జ్ఞానము తెలియబడుచున్నది" (ఎఫెసీ 3 : 10). 2) క్రైస్తవ జీవితమును జీవించుట ఎట్లు.

(4) గాయపడినవారికి వైద్య కేంద్రము: నశించినవాడు రక్షింపబడవలయునంటే అతడు సంఘములోనికి రావలెను. "ప్రతివాడు పడిసెత్తిన వ్యాధి కలిగి యున్నాడు. స్వస్థత కొంచెమైనను లేదు"

(యెషయా 1:5-6). ఆత్మీయ వైద్యుడైన క్రీస్తు మనలను స్వస్థపరచును. అనగా మన పాపమును కడిగివేయును.

(5) సంఘమందు సహవాసము కలదు, ఆరాధనలో కూడా సహవాసము కలదు.

(6) దుష్టుని ఎదిరించుటకు ఇది కేంద్రమై యున్నది.

(7) ఆయన బిడ్డలకు ఒక ఇల్లు: సంఘము దేవునియొక్క గృహమై యున్నది (1 తిమో 2:15). కనుక మనము స్వతంత్రులము... మన సమస్యలు, భారములు, ఆనందము మొదలగునవి భయము లేకుండా దేవునికి వెల్లడి చేయవచ్చు.

మానవనిర్మిత సంఘములు మతశాఖలు అనబడును. అవి దేవునికి చెందినవి కావు. కనుక మతశాఖలవారు తమ పొరపాట్లను తెలుసుకొని వారు మారుమనస్సు నొంది క్రీస్తును ఒప్పుకొని ఆయన సంఘములో చేరినట్లయిన వారు రక్షింపబడుదురు.

—డి. చిరంజీవి,
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, కాకినాడ.

---

## మృతులు ఎక్కడ ఉన్నారు?

### (*Where are the Dead?*)

మృతులు ఎక్కడ ఉన్నారు? అనే ఈ ప్రశ్న వృద్ధులను, యౌవనులను కలవరపెట్టునది. మానవుడు శరీరాత్మలతో పూర్ణమైన వ్యక్తి. "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (ఆది 2:7). శరీరము తాత్కాలికం గాని ఆత్మ నిత్యం. శరీరం మరణిస్తాది, కుళ్లిపోతాది గాని ఆత్మ నిత్యము జీవిస్తాది.

మరణం సంభవించగా శరీరానికి గాక ఆత్మకు ఏమి సంభవిస్తోంది? అనేదాన్ని మనం ఆలోచించాలి. ఆత్మ ఎక్కడికి వెళతాది? అది సమాధిలోనికి పోదు. శరీరమునుండి ఆత్మ వేరవుతాది, శరీరం సమాధిలోనికి పోతాది గాని ఆత్మ కాదనేది వాస్తవం. అయితే ఆత్మ కూడ నేరుగా పరలోకానికో లేక నరకానికో వెళ్లిపోదు.

## పరదైసు

యేసు సిలువమీద చనిపోకముందు సిలువపైనున్న ఒక దొంగతో, "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను" (లూకా 23:43). మారుమనస్సు పొందిన ఈ దొంగ ఆ రోజే పరదైసునకు వెళ్లెనని యేసు చెప్పాడు. అయినను మూడు దినముల తరువాత ఆదివారమున యేసు మగ్దలేనే మరియకు తోటలో అగపడి, "నేను ఇంకను తండ్రియొద్దకు ఎక్కి పోలేదు గనుక నన్ను ముట్టుకొనవద్దు" అని చెప్పాడు (యోహాను 20:17). శుక్రవారంనాడు యేసును, ఆ దొంగయు పరదైసుకు వెళ్లారు. గాని ఆదివారంనాడు ఆయన నేనింకను తండ్రియొద్దకు ఎక్కిపోలేదన్నాడు. గనుక దేవుని నిత్య నివాసం పరదైసు కాదు.

అయితే పరదైసు ఎక్కడ ఉన్నది? యేసు చనిపోగానే ఆయన ఆత్మ ఎక్కడికి వెళ్లెనో తెలుసుకొంటే పరదైసు ఎక్కడఉన్నదో మనం తెలుసుకోగలము అపొ.కా. 2:26, 27లో క్రీస్తు పునరుత్థానమును గూర్చియున్న లేఖనాన్ని పేతురు ఎత్తి చూపించాడు. అక్కడ పాతాళము అనే మాట వాడబడినది. వెడలిపోయిన ఆత్మల నివాసస్థానము పాతాళలోకము (Hades). యేసును, ఆ దొంగయు పాతాళలోకమునకు వెళ్ళిరి. పరదైసు అక్కడ యున్నది.

## పాతాళలోకం (*Hades*)

పాతాళలోకము ఎక్కడుంటుంది? దానిని గూర్చి చెప్పే లేఖన

భాగము లేనైన ఉన్నాయా ? లూకా 16వ అధ్యాయములో లాజరు చనిపోయి అబ్రాహాము రొమ్మున ఆనుకొనియున్నట్లు చదువగలము. ధనవంతుడు కూడ చనిపోయి యాతనపడుచు తన కన్నులెత్తి చూచాడు. లాజరు తన వ్రేలి కొనను నీళ్ళలో ముంచి తన నాలుకను చల్లార్చునట్లు అతని పంపుమని ధనవంతుడు అబ్రాహామును బ్రతిమ లాడాడు. అయితే మాకును మీకును మధ్య మహా అగాధముంచబడి యున్నది గనుక యిది అసాధ్యమని అబ్రాహాము అతనికి చెప్పాడు. అలాగైతే ఆ వేదనకరమైన స్థలమునకు తన సహోదరులు రాకుండు నిమిత్తం లాజరును తన తండ్రియింటికి పంపవలెనని అతడు వేడుకొన్నాడు. అందుకు అబ్రాహాము వారియొద్ద మోషేయు, ప్రవక్తలును ఉన్నారు; వారి మాటలు వినవలెనని అతనికి చెప్పాడు. దీనిని బట్టి శరీరమునుండి ఆత్మ వేరైపోయినప్పుడు, శరీరము సమాధిలోనికిని, ఆత్మ పాతాళలోకమునకును పోవునని మనము గ్రహించగలము. నీతి మంతులు పరదైసునకు లేదా అబ్రాహాము రొమ్మునకు పోవుదురు. అనీతిమంతులు యాతనపడు ప్రదేశానికి పోవుదురు. ఈ రెండు స్థానాలను వేరుచేసే గొప్ప అగాధమున్నది. పాతాళలోకములో అశరీరులుగా యున్న ఆత్మలు ఒకరి నొకరు గుర్తు పట్టుదురు. మరియు భూమిమీద ఏమి జరుగుచున్నదో ఎరుగుదురు.

ధనవంతునికి, లాజరుకు యిది నిత్య స్థితి కాదని మనం ఎరుగుదుము. ఏలయనగా భూమిమీద ప్రజలు ఇంకా జీవించే యున్నారు మరియు తీర్పు ఇంకా సంభవించలేదు. నిజానికి ఈ సంఘటన క్రైస్తవ యుగానికి ముందు సంభవించినది. ధనవంతుని సోదరులు మోషేను ప్రవక్తలను వినాలని అబ్రాహాము చెప్పాడు. క్రైస్తవ యుగం ఆరంభమయ్యుంటే వారు క్రీస్తును, అపొస్తలులను వినాలని అతడు చెప్పియుండును.

## తీర్పు

ఇదంతయు నిజమైతే, తీర్పు ఎందుకు? అని ఎవరైనా అనవచ్చును. దేవుడు న్యాయ సభలో కూర్చొని మనందరిని గూర్చిన సాక్ష్యములు విని అప్పుడు అపరాధియనో, లేక నిరపరాధియనో తీర్పు నిస్తాడని మనం ఊహించరాదు. మనకు ఇప్పుడే తీర్పు తీర్చబడుచున్నది. మరియు మనం మరణించగానే, మన నిత్య స్థితిలో మార్పు యేమీ తీసికొని రాలేము. తీర్పునాడు న్యాయాధిపతి తన తీర్పును ప్రకటించును. దేవునితో నిత్యము ఉండుటకు నీతిమంతులు పరలోకానికి వెళ్లుదురు గాని నశించినవారు అపవాదితోను, వాని దూతలతోను నిత్య యాతన పడుటకు నరకమునకు పోవుదురు.

—రోయ్ బీస్లే.

---

## బాప్తిస్మము - కృప

## ( *Baptism and Grace* )

కృప ద్వారా రక్షణ కలుగునని లేఖనములు బోధించుచున్నాయి. "ప్రభువైన యేసు కృపచేత మనము రక్షణ పొందుదుమని నమ్ముచున్నాము" అని పేతురు చెప్పాడు (అపొ. కా. 15:11). "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారని" పౌలు చెప్పాడు (ఎఫెసీ 2:8).

అయితే బాప్తిస్మమును గూర్చికూడ పేతురు ఇట్లనుచున్నాడు: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదు గాని యేసు క్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3:21).

సవరణోద్యమ కాలమంతటిలోను కృపకును బాప్తిస్మమునకును గల సంబంధాన్ని గూర్చి భిన్నాభిప్రాయములు వెల్లడి అయ్యేవి. రక్షణ కృపద్వారా కలుగుచున్న యెడల బాప్తిస్మము అనవసరమని కొందరు వాదించేవారు. అందువలన అనేక మతశాఖలవారు బాప్తిస్మముయొక్క ప్రాముఖ్యతను చాటించలేకపోవు చున్నారు. మరి కొందరయితే కృప పొందడానికి బాప్తిస్మము ఒక అత్యావసర సాధన మని నొక్కి చెబుతారు. అయితే ఈ సమస్య ఎట్లు పరిష్కరింపబడ తాది ?

## పొందువాడు ప్రతిస్పందిచాలి

ఇచ్చే ప్రతి క్రియలోను రెండు సంగతులు ఇమిడి యున్నాయి. యిచ్చువాని చేయి, పొందువాని చేయి. పొందువాడు ఏవిధంగాను ప్రతిస్పందించలేకపోతే ఇచ్చుట లేక కృప పరిపూర్ణము కాజాలదు. వ్యాధితో బాధపడుచున్న వాని యింటికి ఇద్దరు క్రైస్తవులు వెళ్లారు. వారు వాని యిల్లును ఊడ్చి, బట్టలు ఉతికి, అతనికి మందులు ఉచితముగా ఇవ్వడానికి సంకల్పించారు. గాని దీని నంతటిని అతని కుటుంబము నిరాకరించింది. వారి కనుగ్రహింపబడిన కృపను పొందుటకు వారు నిరాకరించారు.

## కృపకు ప్రతిస్పందన బాప్తిస్మము

దేవుడు తన కృపను బట్టి అనేక దీవెనలు, వరములు మనకిచ్చు చున్నాడు. ఆయన కృపను, ఈవులను పొందుటకు బాప్తిస్మము మనం యిచ్చే ప్రతిస్పందన (response) అయియున్నది. నీటిలో మన శరీర మాలిన్యము కొట్టుకొని పోవుటవలన బాప్తిస్మము మనలను రక్షించుట లేదు గాని ఆ క్రియలో మానవుడు పునరుత్థానుడైన క్రీస్తుతో ఏకమవుచున్నాడు. గనుక అది రక్షించుచున్నది అని ఒక గొప్ప బైబిలు పండితుడన్నాడు. దేవుని యీవులకు బాప్తిస్మముద్వారా విధేయత

చూపువానికి కలుగు కనీసం 12 కృపా వరాలను లేక యీవులను అతడు ఒక పట్టికగా వ్రాసాడు.

1. పాపక్షమాపణ (అపొ. కా. 2:38).
2. పాపమునుండి శుద్ధుడగుట (అపొ.కా. 22:16; 1 కొరి 6:11).
3. క్రీస్తుతో ఏకమవుట (గలతీ 3:27).
4. ఆయన మరణ పునరుత్థానములయందు ఏకమవుట (రోమా 6:3-6; కొల 2:10-12).
5. పాపముయొక్క శక్తి నుండి విడుదల (రోమా 6:1-11, 17).
6. క్రీస్తుయొక్క కుమారత్వములో పాలు పొందుట (గలతీ 3:26, 27).
7. దేవునికి ప్రతిష్ఠించుకొనుట (1 కొరి 6:11).
8. క్రీస్తు శరీరమైన సంఘములో సభ్యత్వము (1 కొరి 12:13).
9. పరిశుద్ధాత్మను పొందియుండుట (అపొ. కా. 2 : 13; 1 కొరి 12:13).
10. ఆత్మలో క్రొత్త జీవితము, క్రొత్త జన్మ (తీతు 3:5; యోహా 3.5).
11. దేవుని చిత్తప్రకారం జీవించుటకు సహాయం (రోమా 6:3, 6, 7, 11-14; హెబ్రీ 4:16).
12. దేవుని యెడల నిర్మలమైన మనస్సాక్షి ఇచ్చు ప్రత్యుత్తరం (1 పేతు 3:21).

దేవుడు ఈ యీవులన్నిటిని తన కృపద్వారా మనకిచ్చుచున్నాడు, గాని విశ్వాసము ద్వారా బాప్తిస్మము పొందకపోతే అవి మనవి కావు.

## బాప్తిస్మము పొందుమని కృప బోధించును

బాప్తిస్మమునుగూర్చి, మనము దానికి లోబడాలనే వాస్తవాన్ని గూర్చి దేవుని కృపవలననే ఎరుగుదుము. "సమస్త మనుష్య

లకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై . బోధించుచున్నది" (తీతు 2:11-13). దేవుడు బోధించుట మానివేయలేదు. మన స్వంత ఊహలను బట్టి అనుసరించడానికి ఆయన మనలను వదలివేయలేదు. "మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదు" (యిర్మి 10:23).

పాపమునుండి పారిపోయి రక్షణను పొందుట ఎట్లో దేవుడు తన కృపవలన మనకు బోధించియున్నాడు. ఆ బోధలో బాప్తిస్మము ఇమిడియున్నది. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని దేవుని కృప మనలను ఆజ్ఞాపించుచున్నది (అపొ. కా. 2.38).

## బాప్తిస్మము పుణ్యకార్యము కాదు

దేవుని కృపావరములను పొందుటలో బాప్తిస్మము ఒక సాధనమని కొందరు నిరాకరిస్తారు. ఒకడు బాప్తిస్మముద్వారా రక్షింపబడితే అది పుణ్యకార్యమవునని వారు తలస్తారు. అయితే బాప్తిస్మమొక పుణ్యకార్యము కాదు. పుణ్యకార్యములలో వేరొకడు అచ్చియుండునట్లగును. ఒకడు తీవ్రమైన గుండెవ్యాధితో బాధపడుచుండవచ్చును. అతనికి వేరొకని గుండె అతికిస్తే బ్రతుకుతాడు గాని అతనివద్ద డబ్బు లేదు, గుండెను యిచ్చే మరొక వ్యక్తి లేడు. అయితే కేన్సరుతో చనిపోవుచున్న మరి యొకడు అతని గుండెను యిచ్చుటకు ఒప్పుకొంటాడు. వైద్యులు గుండెమార్పు ఆపరేషన్‌ను ఉచితంగా చేస్తారు. ఆపరేషన్ అయిన తరువాత వైద్యులతని తిండినిగూర్చి, వ్యాయామాన్నిగూర్చి, విశ్రాంతినిగూర్చి తీవ్రమైన హెచ్చరికల నిస్తారు. ఈ రోగి వైద్యుల సలహాలను పాటించుట పుణ్యకార్యమగునా ? ఏవిధంగాను

కాదు. ఆ సలహాలను పాటించకపోతే అతడు బుద్ధిహీనుడగును. తద్వారా తన యెడల చూపబడిన కృపను నిరాకరించును.

పాపమునుండి వైదొలగి రక్షణపొందే విధానాన్ని గూర్చి దేవుడు మనలను హెచ్చరించాడు. మనం ఆయన హెచ్చరికలను పాటించి ఆయనకు లోబడునప్పుడు ఆయన మనకు అచ్చియున్నవాడు కాడు. ఆయన మనపై కుమ్మరించు కృపకు ప్రతిస్పందిస్తాము, అంతే.

బాప్తిస్మము, కృప ఈ రెండు ఒకదానితో నొకటి సమన్వయము కలిగి యున్నవి. దేవుని కృప మనకు రక్షణ నిచ్చుచున్నది. మనము విశ్వాసము, మారుమనస్సు, బాప్తిస్మముద్వారా ప్రతిస్పందించాలని ఆయన కృప బోధించుచున్నది. మన విధేయత వలన అనన్యమైన దేవుని కృపను పొందగలము. —F. ఫర్మన్ కియర్లీ.

---

## తప్పుడు సిద్ధాంతములు

(గత సంచిక తరువాయి)

గత సంచికలో తప్పుడు సిద్ధాంతాల్ని కొన్నిటిని చూచాము. ఇప్పుడు బైబిలు సిద్ధాంతములను తెలిసికొందము.

**1. అపొస్తలుల సిద్ధాంతములు :**

"వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును రొట్టె విరుచుట యందును ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి" (అపొ. కా. 2:42).

**2. యేసుక్రీస్తు సిద్ధాంతము :**

"క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడు దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచి యుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించు వాడు (2 యోహాను : 9).

సిద్ధాంతరూపంలో ఉన్న దానిని అంగీకరించాలి. ఎందుచేతనంటే, "మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగా లోబడినవారై పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము" (రోమా 6:17).

కాబట్టి సత్యము తెలిసిన క్రీస్తు సంఘస్తులు తప్పుడు సిద్ధాంతాన్ని ఖండించవలసిన బాధ్యత ఎంతైనా వుంది.

"వాక్యమును ప్రకటించుము. సమయమందును అసమయమందును ప్రయాస పడుము. సంపూర్ణమైన దీర్ఘ శాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధి చెప్పుము. ఎందుకనగా జనులు హితబోధను సహింపక, దురదచెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసికొని సత్యమునకు చెవి ఇయ్యక కల్పనా కథలవైపునకు తిరుగు కాలము వచ్చును" (2 తిమోతి 4:2-4).

తప్పుడు సిద్ధాంతాల్ని ఎదుర్కొన్నప్పుడేమి చెయ్యాలి ? అని ప్రశ్నించుకుంటే అటువంటి సిద్ధాంతాల్ని తోసిపుచ్చాలని బైబిలు జవాబు చెప్పుచున్నది.

"మీరు క్రీస్తుతో కూడ లోకముయొక్క మూల పాఠముల విషయమై మృతి పొందినవారైతే లోకములో బ్రదుకుచున్నట్టుగా మనుష్యుల ఆజ్ఞలను పద్ధతులను అనుసరించి - చేత పట్టుకొనవద్దు. రుచి చూడవద్దు, ముట్టవద్దు అను విధులకు మీరు లోబడనేల ? అవన్నియు వాడుకొనుటచేత నశించిపోవును" (కొలస్స 2:22).

ఏ తప్పుడు సిద్ధాంతగాలికి కొట్టుకొని పోకూడదు.

అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి, మనుష్యుల మాయోపాయములచేత వంచనతోను, తప్పుమార్గమునకు లాగు

కుయుక్తితోను గాలికి కొట్టుకొని పోవునట్లు, కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొని పోవుచు అలల చేత ఎగురగొట్టబడిన వారమైనట్లుండరాదు (ఎఫెసీ 4:14).

కొంతమంది మత ప్రపంచానికి చెందిన బోధకులు సిద్ధాంతాలపై బోధించడానికి నిరాకరిస్తారు. వారు అటు ఇటు (రెండు శాఖల్లో) చెందిన వారై యుంటారు. "సందేహించువాడు గాలిచేత రేపబడి యెగిరిపడు తరంగమును పోలియుండును. అట్టి మనుష్యుడు ద్విమనస్కుడై తన సమస్త మార్గములయందు అస్థిరుడు" (యాకోబు 1:6).

అట్టివారు జనావళికి భయపడతారు. కాని మనం? "మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక యుండలేమని వారికి ఉత్తర మిచ్చిరి" (అపొ.కా. 4:20). బైబిలును బోధించడం అంటే దేవుని సిద్ధాంతాన్ని బోధించడం. "ఎందుకనగా దేవదూతలద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడినందున ప్రతి అతిక్రమమును అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొందియుండగా ...... (హెబ్రీ 2:2-4). మనము దేవుని సిద్ధాంతాన్ని బోధించటానికి సిగ్గుపడకూడదు. నిందింపబడే మానవ కల్పిత సిద్ధాంతాల్ని నీకు తగినంత వరకు ఖండించు. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును ఖండించుటకును తప్పు దిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16). ప్రియచదువరీ! నీవింకను తప్పుడు సిద్ధాంతములలోను, మానవ మత శాఖల్లోను మూలుగుచున్నవా? నీవు నేడే అట్టి సిద్ధాంతములను, మానవ మతశాఖలను వదలిపెట్టి బైబిలు సిద్ధాంతముపైపు తిరుగు. అప్పుడు క్రీస్తు తన సంఘములో నిన్ను చేర్చుకొనును.

—ఇసుకపట్ల ఇజ్రాయెల్, కాకినాడ.

---

# వెండిపళ్లెంలో బంగారు పండ్లు

1. లోకము అందరిదీను (1 యోహాను 2:15-17).
పరలోకమైతే; కొందరిదే! కానీ (మత్తయి 7:13-14).
యేసుక్రీస్తు అందరికి ప్రభువు! (అ. కార్య 10:35-36).

2. యథార్థ వాది లోక విరోధి (మార్కు 3:6).
లోకులు కాకులై కేకలేస్తే (లూకా 23:23).
లౌకికవాది దేవుడికి విరోధి! (యాకోబు 4:4).

3. వక్తలంతా భక్తులు కారు (తీతు 1:16).
భక్తులంతా వక్తలు కాలేరు (1 పేతురు 4:16-19).
సువార్త ప్రకటించేవాడు ప్రవక్త! (1 కొరింథి 1:18-25).

4. కానులపై ఆశ ఉన్నవాడు (సామెతలు 11:28).
కాలేడు "గొప్పవాడు" కానీ! (మత్తయి 5:19).
ధనవంతుడు అవుతాడు! (లూకా 18:25).

5. ఆస్తులు పెంచుకొనేవాడు (హబక్కూ 2:6-13).
ఆత్మనే నష్టపరచుకుంటాడు (1 సమూయేలు 25:36-38).
అతడు దేవుని దృష్టికి వెర్రివాడు! (లూకా 12:15-21).

6. చచ్చిన సింహముకంటెను (ప్రసంగి 9:4-5).
బ్రదికిన కుక్క మేలే అయినా;
కుక్కల విషయమై జాగ్రత్త పడాలి! (ఫిలిప్పీ 3:2).

7. ఎద్దును గాడిదను కలిపి దున్నినా (ద్వితీ 22:10).
విశ్వాసికి అవిశ్వాసిని జత చేసినా (11 కొరింథి 6:14-16).
హర్షనీయం కాదు అజ్ఞాతిక్రమం! (1 యోహాను 3:1-4).

—M. సామ్యూల్ జాన్, కొణితివాడ.

## సాతాను స్థితి గతులు - మిషనరీ పని

ప్రపంచములో మంచి స్వభావముగలవారి నందరు ప్రేమిస్తారు. చెడ్డవారిని ద్వేషిస్తారు, భయపడతారు. చీకటి, అగ్ని, నీరు, సర్పములు, క్రూరమృగములు అంటే అందరికి భయమే. అందరము ఎక్కువగ భయపడునది, ఒక్కటున్నది. అది మరణము. మొదటి మరణము సహజము అందరికి. రెండవ మరణము, అగ్ని గంధకములతో మండు గుండము. (ప్రకటన 21:8). ఈ జాబితాలోయున్న వారందరు చెడ్డ వారే. వీరి నాయకుడు సాతాను. అనగా(సా + తాను). తాను సాధిస్తాడు దేనినంటే, చెడుగు, పాపము చేయుటలోను, చేయించుటలోను, సాధిస్తాడు లేక శోధిస్తాడు.

చాలమంది పిల్లలు, చీకటిలో సంచరించుటకు భయపడుదురు. ఏమని ప్రశ్నిస్తే? దయ్యాలు, భూతాలు, ఉండునంటారు. నిజముగ, మనము ఆత్మను చంపనేరక, ఆత్మను, శరీరమును, నరకములో, నశింప జేయు శక్తిగలవానికే భయపడాలి. గాని, భూతానికి కాదు. దయ్యము పురుష రూపముదాల్చి నల్లని ఘూటు ధరించి, రెండు కొమ్ములు కలిగియుండి పొడవైన తోక కల్గి యుండు నందురు కొందరు. అయితే వా రూహించినట్లు కాదు. భూతమునకు మానవునకున్నట్లు ఎముకలుండవని ఒక సందర్భములో క్రీస్తువారు చెప్పినట్లు మనము గమనించగలము. అది ఒక దుష్టాత్మ (Wicked spirit) అపవిత్రాత్మ యని అనేక పర్యాయములు బైబిలులో వాడబడినది. పాపముచేయ నేర్పించునది, మన అంతరంగములో యున్నట్లు పౌలు భక్తుడు చెప్పుచున్నాడు. ఏలయనగా నేను చేయునది నేనెరుగను, చేయ నిచ్ఛయించునది చేయక, ద్వేషించునదే చేయుచున్నాను. దానిని చేయునది నా యందు నివసించు పాపమే. నా మనస్సునందు, ధర్మశాస్త్రముతో పోరాడు వేరొక నియమము నా అవయవములలో నున్నది. అది పాపనియమము (రోమా 7:15, 23).

పాపమును తెచ్చిపెట్టినవాడే పాపపురుషుడు, నాశనపాత్రుడు. (2 థెస్స 2:3). ఈనాడు ఆ నాశనపాత్రునియొక్క స్థితిగతులు, వాని యొక్క మిషనరీ పని కొంతవరకు తెలిసికొనవలెనను నదియే ఈ వ్యాసముయొక్క ఉద్దేశమై యున్నది.

దేవుని చిత్తమునకు వ్యతిరేకియైన ప్రతివాడు సాతాను సంబంధే. ఆయన చిత్తమునకు, వాక్యమునకు, విధేయుడు కాని ప్రతివాడు క్రీస్తు విరోధి యని చెప్పవచ్చును. వేరుపడినవాడని చెప్పవచ్చును. ఈ ప్రపంచమందలి వస్తువులు చాలమట్టుకు మన అనుదిన ప్రయోజనములకై వాడుకొనుచున్నాము. అవి మనకు మంచిగాను, చెడ్డగాను ఉపయోగించవచ్చును. మనలను సృజించిన దేవునియొక్క ఉద్దేశము మనము మంచిగా జీవించవలెనని ఫలించి అభివృద్ధి చెంది భూమిని నిండించి, విస్తరించి దానిని లోపరచుకొనునట్లు ఆయన మనలను ఆశీర్వదించెను (ఆది. కా. 1:28) దేవుడు తాను సృజించిన సృష్టి యావత్తు చూచి, అది మంచిదని తలచెను (ఆది. కా. 1:19; 1:25; 1:31).

అంతయు మంచిదిగాచేసి, చూచిన దేవుడు ఆదామవ్వలను శోధించిన సాతాను ఎక్కడనుండి వచ్చెను? సృష్టి క్రమములో సాతానుయొక్క వివరణ మనకేమియు కనబడదు. ఇట్టి సాతాను ఎట్లు ఉత్పత్తియైనదనియు, చెడ్డదానిని దేవుడెందుకు సృజించెనని ఈనాడు అందరు అడుగు ప్రశ్నయే. భూజంతువు లన్నిటిలో సర్పము మిగుల యుక్తిగలదై యుండెను. సాతాను సర్పరూపముదాల్చి, మానవ స్వరముతో మాట్లాడినట్లు చూడగలము. సాతాను పరలోకమందలి దూతల మీదగాని, దేవుని మీదగాని పరలోకమందు దీని శక్తి చాలదు. అది కేవలము భూమియందలి ప్రజలపై దాని ప్రభావమును చూపును. దానికి కూడా దుష్టశక్తి కలదు. ఆజ్ఞను అతిక్రమించుట పాపము

అది రెండు విధములుగా జరుగును. ఉద్దేశపూర్వకముగా అతిక్రమిం
చుట. ఎవరో యొకని ప్రోద్బలమువలన అతిక్రమింతురు. ఆదేవని
సాతాను, హవ్వను ప్రోత్సహించి పాపములో పడవేసినట్లు చూచు
చున్నాము. సర్పము భూజంతువు లన్నిటిలో యుక్తిగలదైనట్లు
చూచుచున్నాము. ఒక సందర్భములో పావురమునవలె నిష్కపటులును
పాములవలె వివేకమును కలిగి యుండుడని హెచ్చరించుచున్నట్లు
కన్పడుచున్నది. అనగా, పాము చాల తెలివైనదన్నట్లు గోచరమగు
చున్నది. ఆది. కా. 3:5 లో ఆదామవ్వలు మంచి చెడ్డల నెరిగిన
వారై అని యున్నది. మంచిని ఎరుగునట్లు చేయువాడు దేవుడు. చెడ్డది
ఎరుగునట్లు చేయు పని సాతానుది. ఆదేవని ఈ దినములలో సాతాను
కొందర్ని లేవనెత్తి, సత్యవాక్యమును విడిచి ముందుకు సాగిపోవునట్లు
చేసి ఏ బాప్తిస్మమైనా పర్వాలేదు, ఏ పేరైనా సంఘమునకు పెట్టుకో
వచ్చును పర్వాలేదు, ఏవిధముగానైన ఆరాధించవచ్చును. పర్వా
లేదను తృప్తిని సంఘ సంస్కర్తలకు కలుగజేసి చెడ్డది ఎరుగు
నట్లు ఆత్మీయ అంధత్వమును వారి మనోనేత్రములకు కలుగజేయు
చున్నది.

మనము సాతానుయొక్క ఉత్పత్తిని గూర్చి తెలిసికొందము.
ఆదిలో దేవుడు సమస్తమును, క్రీస్తుద్వారా క్రీస్తు మూలముగ సృష్టి
యావత్తు జరిగించెను. ఏలాగనగా, ఆకాశమందున్నవియు, భూమి
యందున్నవియు, దృశ్యమైనవిగాని అదృశ్యమైనవిగాని అవి సింహాస
నములైనను, ప్రభుత్వములైనను, అధికారులైనను సర్వమును ఆయన
ద్వారా ఆయనను బట్టి సృజింపబడెను (కొలస్స 1:16).

ఆయన అన్నిటికంటె ముందుగా యున్నవాడు. ఆయనకు అన్ని
టిలో ప్రాముఖ్యముకల్గు నిమిత్తము ఆయన ఆదియై యుండెను.
ఆదియై యున్నవాడు ఆకాశమందలి సమస్త జీవరాసులను అనుటలో

దేవదూతలున్నవి. ఆ జీవరాసులు మనకు కనబడుటలేదు. దేవదూతలు భూమిమీద నున్నవాటికంటె ముందుగా సృజింపబడెనని తెలియుచున్నది. దేవదూతలు ఆరురోజుల సృష్టిలోనివికూడా కాదని తెలియుచున్నది. కాని సాతాను ప్రత్యేకముగాను సృష్టింపబడలేదు. సాతాను అనునది దూతల సమూహములోనిదే యని గ్రహింపగలము. మరియు తమ ప్రధానత్వమును నిలుపుకొనక తమ నివాసములను విడిచిన దేవదూతలను మహాదినమున జరుగు తీర్పువరకు కటికచీకటిలో నిత్య పాశములతో బంధించి భద్రము చేసెనని తెలియుచున్నది (యూదా 1:6) (2 పేతురు 2:4).

ప్రధానత్వము నిలుపుకొనక అనుమాటకు దేవుడు నియమించిన పనిని చేయక విడిచిపెట్టబడిన వాటివని అర్థము. వాటిని ఆయన చీకటిగల బిలములోనికి త్రోసి తీర్పుకావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను. ప్రధానమైనదూతలకు ఆయన పేర్లుపెట్టినట్లు తెలుసుకున్నాము (గాబ్రియేలు, మిఖాయేలు, లూసీఫర్). యిందు లూసీఫర్ అను దేవదూత, ప్రధానత్వము కావలెనని కోరుకొని తన మనస్సులో ఒక చెడ్డకోరికను తలంచుకొనెను. అది తాను ఎంచుకొన దానికన్న అధికముగ ఎంచుకొనినట్లు మనము యెషయ గ్రంథమందు చూడగలము. ఏమనగా—

నేను ఆకాశమున కెక్కిపోదును. దేవుని సింహాసనమునకుపైగా నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చింతును. ఉత్తర దిక్కున నున్న సభాపర్వతము మీద కూర్చుందును. మేఘమండలము మీది కెక్కుదును. మహోన్నతునితో నన్ను సమానముగా చేసికొందును అని నీ మనసున అనుకొంటివిగదా! (యెషయ 14:13, 14). ఈ చెడు ఆలోచన మనస్సునందుంచుకొని దేవునిపై ఎదురు తిరిగిన దేవదూతను దేవుడు తన స్థానమునుండి పడద్రోసెను. కాగా సర్వలోకమును మోసపుచ్చుచు అపవాదనియు, సాతాననియు పేరుగల ఆది సర్పమైన ఆ మహాఘటసర్పము దాని దూతలు పడద్రోయబడిరి.

(సశేషం)

— A. ఇశ్రాయేలురాజు, కాకినాడ.

# ఒక ప్రకటన

1987 నవంబరులో కాకినాడలో జరిగిన లెక్చర్‌షిప్ కొరకు ప్రత్యేకంగా ముద్రించిన కీర్తన పుస్తకాలు మరల ఇప్పుడు మావద్ద లభించుచున్నవి. 28 పాటలు గల చిన్న పుస్తకం ఒక్కొక్కటి ఒక రూపాయి మాత్రమే. పది పుస్తకాలు, అంతకంటే అదనంగా కావలసిన వారికి మాత్రమే అవి పోస్టులో పంపించబడును. వలయువారు ఈ దిగువ చిరునామాకు M.O. చేసి పొందండి.

SATYA VANI
P.O. Box 80, KAKINADA – 533 001.

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**S A T Y A W A K K U**
P.O. Box. 80
KAKINADA 533 001

No.

To
..................................................
..................................................
..................................................
..................................................